# ప్రజాక్షేత్రం
PRAJA KSHETRAM
prajakshetram.in



రిపోర్టర్లు కావలెను
ప్రజాక్షేత్రం
కాల్ : 9177920459



సంపుటి: 01 | సంచిక: 263 | హైదరాబాద్ | ఆదివారం | 09-03-2025 | పేజీలు: 06 | వెల 4/-


## రాష్ట్రంలో నిత్యం కరెంట్ కోతలు

బీఆర్ఎస్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ సర్కార్ సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు




## రాష్ట్రంలో కమీషన్ల రాజ్యం నడుస్తోంది

సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి




### మాట ఇస్తున్నా..
# కోటీశ్వరుల్ని చేస్తా

**విద్యార్థులు రాణించాలి కలల్నినిజం చేయాలి**

**చాకలి ఐలమ్మ పేరు పెట్టుకోవడం..తెలంగాణకు గొప్ప కీర్తి**



అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలతో. ఈ యూనివర్సిటీ పోటీ పడాలి

ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ బ్యూరో మార్చి 08(ప్రజాక్షేత్రం):

అన్ని రంగాల్లో మహిళా యూనివర్సిటీ విద్యార్థులు రాణించి రాజీవ్ గాంధీ కలల్నినిజం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో నూతన భవన నిర్మాణాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకోవడం తెలంగాణకు గొప్ప కీర్తి. అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలతో ఈ యూనివర్సిటీ పోటీ పడాలి. అన్ని రంగాల్లో మహిళా యూనివర్సిటీ విద్యార్థులు రాణించి రాజీవ్ గాంధీ కలల్నినిజం చేయాలి. ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే సందర్భం వస్తుంది. అందులో మీ ప్రాతినిధ్యం ఉండాలని ఆకాంక్షిస్తున్నా. మహిళలకు అవకాశం ఇస్తే తమ చిత్తశుద్ధిని నిరూపించుకుని ఆదర్శంగా నిలబడుతున్నారు. ఈ యూనివర్సిటీలో చదువుకోవడం ఇక్కడి విద్యార్థుల అదృష్టం. మీ అన్నగా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకాన్ని అమలు చేస్తున్నాం. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించి వారికి పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగించాం. ఆడబిడ్డలను వంటింటి


మిగతా 2వ పేజీలో


### మహిళలు కోటీశ్వరులు కాదు..
# అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చింది..

**కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్‌రావు ఫైర్**

ఇందిరా మహిళా శక్తి పేరిట వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటు..

ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది..



తెలంగాణ బ్యూరో మార్చి 08(ప్రజాక్షేత్రం):

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి కోతలు కోసిన రేవంత్ రెడ్డి.. ఏడాదిన్నర పాలనలో మహిళలను చేసింది ఎడతెగని వంచనే అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలు కోటీశ్వరులు కాదు.. అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మిగిలింది ఎడతెగని వేదనే. మహిళలను కోటీశ్వరులను కాదు, కనీసం లక్షాదికారులుగా చెయ్యని చేతగాని సర్కారు మీది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఏడాదిన్నర పాలనలో మహిళలకు


మిగతా 2వ పేజీలో


## ఆర్ఆర్ఆర్ గురించి నితిన్ గడ్కరీతో చర్చించాం

జాతీయ రహదారులను విస్తరిస్తాం

రాష్ట్ర ప్రభుత్వం పైఓవర్ల కింద భూసేకరణ

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి


02




# మహిళలు శక్తి స్వరూపాలు..

**స్త్రీల అభ్యున్నతికి పాటుపడే ఏకైక పార్టీ బీజేపీ**

**రాష్ట్రపతి, ఆర్థిక మంత్రిగా మహిళలకు బాధ్యతలు అప్పగించిన పార్టీ బీజేపీ**

**మహిళా సాధికారతను చేతల్లో చూపుతున్న మహనీయుడు మోదీ**

తెలంగాణ బ్యూరో మార్చి 08(ప్రజాక్షేత్రం):

అమ్మవారి శక్తి స్వరూపాలు... సృష్టికి మూల కారకులు... కుటుంబాన్ని, సమాజాన్ని కంటికి పాపలా కాపాడుతున్న స్త్రీ మూర్తులందరికీ కేంద్రమంత్రి బండి సంజయ్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సృష్టిలో ఏమీ ఆశించకుండా పిల్లల ఎదుగుదలకు జీవితాన్నే త్యాగం చేసేది తల్లి మాత్రమే.. అక్కా చెల్లెళ్ల రూపంలో, భార్యగా తోడునీడగా నిలిచేది స్త్రీ మూర్తులే.. ఒక్క మాటలో చెప్పాలంటే స్త్రీ లేకపోతే అసలు సృష్టే లేదని బండి సంజయ్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవం నాడు మాత్రమే మహిళలను పొగిడి... ఆ తరువాత వారిని విస్మరించే


మిగతా 2వ పేజీలో




### కేసీఆర్ అసెంబ్లీకి ఎప్పుడు వస్తారు?
# మేం ఎదురుచూస్తున్నాం

కేసీఆర్ చేసిన తప్పులకు మేం మాటలు పడుతున్నాం

కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్ పెట్టింది ఎవరు?

మీరు చేసిన కర్మల వల్ల మేం ఢిల్లీకి పోతున్నాం

ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలు


02




### పదేళ్లుగా మహిళల అభివృద్ధికి
# ఎంతో చేశాం

గుజరాత్ లో ప్రధాని నరేంద్ర మోడీ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా

గుజరాత్ లోని నవసారి బహిరంగ సభ


02


త్రిపుల్ తలాక్ కు వ్యతిరేకంగా చట్టం తెచ్చి

లక్షల ముస్లిం మహిళల జీవితాల్ని కాపాడాం



## గుజరాత్ కాంగ్రెస్ నేతలు బీజేపీతో చేతులు కలిపారు



సగం మంది పైగా ఇలానే ఉన్నారు

కాంగ్రెస్ అగ్రనేత

రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

కొందరు బీజేపీకి బీ-టీమ్ గా

మారారని సొంతపార్టీ నేతలపైనే విమర్శలు

నకిలీ నేతలకు బుద్ధి చెప్పాలి

గుజరాత్ లో 30 ఏళ్లుగా

బీజేపీ పాలనలో విఫలమైంది


02


## ఢిల్లీలో అర్హులైన మహిళలకు నెలకు రూ. 2500

సీఎం రేఖా గుప్తా

మంత్రివర్గం ఆమోదం




## ఆ బస్సులకు సకాలంలో కిరాయి చెల్లిస్తారా?

ఎమ్మెల్సీ కవిత


02




# మహిళలు కోటీశ్వరులు కాదు.. అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చింది..

మొదటి పేజి తరువాయి

ఏం చేసారని నేడు వేడుకలు నిర్వహిస్తున్నారు అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఏటా 20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత అన్నట్లుంది కాంగ్రెస్ తీరు. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇచ్చిన సమాధానం ప్రకారం, సుమారు రూ. 5 వేల కోట్ల వడ్డీ లేని రుణాల బకాయి ఉంది. బకాయిలే చెల్లించని కాంగ్రెస్ ప్రభుత్వం, ఐదేళ్లలో లక్ష కోట్ల రుణాలు ఎలా ఇస్తుంది? కాంగ్రెస్ ప్రభుత్వ తీరు వల్ల మహిళలు కోటీశ్వరులు కాదు, అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు.

**ఇందిరా మహిళా శక్తి పేరిట వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటు..**

'మహిళలకు ప్రతి నెలా రూ. 2500' ఇస్తామని ఆరు గ్యారెంటీల్లో మొట్ట మొదటి హామీగా చెప్పి ఏడాదిన్నరగా అమలు చేయని రేవంత్ సర్కారు, ఈరోజు ఇందిరా మహిళా శక్తి పేరిట వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలోని ప్రతి మహిళకు బకాయి పడ్డ రూ. 37,500 ఎప్పుడు చెల్లిస్తారు? రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే, చేతలు మాత్రం గడప దాటవు అని మరోసారి నిరూపితమైంది. గ్యారెంటీలు, 420 హామీలు అని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్లే రేవంతు సర్కారు, మహిళలను దారుణంగా వంచించింది. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, కేసీఆర్ గారు మహిళా సంక్షేమం, సాధికారత, స్వయం సమృద్ధి కోసం ప్రారంభించిన పథకాలకు మంగళం పాడారు అని హరీశ్‌రావు విమర్శించారు.

**ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం..**

ఇందిరమ్మ రాజ్యంలో... కేసీఆర్ కిట్టు బంద్ అయ్యింది. కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ బంద్ అయ్యింది. బతుకమ్మ చీరెలు బంద్ అయినయి. ఆరోగ్య లక్ష్మి బంద్ అయ్యింది. ఆరోగ్య మహిళ బంద్ అయ్యింది. పింఛన్ల పెంపు బంద్ అయ్యింది. కడుపు కోతలు మల్లా పెరిగినయి. పెరిగిన క్రైం రేటుతో ఆడబిడ్డలకు భద్రత కరువైంది. నోటిఫికేషన్లు రాక, యువతుల ఉద్యోగ కలల సాకారం ప్రశ్నార్థకమైంది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవి అమలు చేయకుండా ఇన్నాళ్లూ కాలం వెల్లదీసారు. ఇప్పుడమో అన్నీ చేసినట్లు, మహిళలను కోటీశ్వరులను చేసినట్లు కోట్లు ఖర్చు చేసి ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం, అధికారంలోకి వచ్చాక అబద్ధాలు ప్రచారం చేసుకుంటం అన్నట్లుంది కాంగ్రెస్ వైఖరి అని హరీశ్‌రావు మండిపడ్డారు.

**నేడు వేడుకలు జరుపుకోవడం నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్లుంది..**

మీ అభయహస్తం మేనిఫెస్టోలో చెప్పి, ఏడాదిన్నరగా మాట తప్పిన హామీలను గుర్తు చేస్తున్నాను. మహాలక్ష్మి కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2500. ఇప్పటికీ అమలు లేదు. సంవత్సరానికి 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తమన్నరు. అతీగతీ లేదు. 18 ఏళ్లు పైబడి, చదువుకునే ప్రతీ యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్ ఇస్తమన్నరు. ఊసే లేదు. ఆడబిడ్డ పెళ్లికి లక్ష ఆర్థిక సాయంతో పాటు, తులం బంగారం ఇస్తామన్నరు. జాడే లేదు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం నైపుణ్య శిక్షణా కేంద్రంతో పాటు, ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తమన్నరు. పత్తాలేదు. డ్వాక్రా సంఘాలకు పక్కా భవనాలు నిర్మిస్తం అన్నరు. ప్రస్తావన లేదు. పుట్టిన ప్రతి ఆడ బిడ్డకు ఆర్థిక సాయంతో కూడిన 'బంగారు తల్లి' పథకాన్ని పునరుద్దరిస్తం అన్నరు. పథకమే లేదు. అంగన్‌వాడీ టీచర్లకు నెలసరి వేతనం 18,000లకు పెంచుతూ, ఇపిఎఫ్ పరిధిలోకి తెచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తం అన్నరు. ఆలోచనే లేదు. ఆశా వర్కర్లకు తక్షణమే వేతనాలు పెంచుతం అన్నరు. సోయి లేదు. ఇందులో ఒక్క హామీని అమలు చేయకుండా, నేడు వేడుకలు జరుపుకోవడం నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్లుందని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

**రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది..**

ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది. మహిళల పై అత్యాచారాలు, లైంగిక వేధింపుల ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. మహిళలపై నేరాలు అడ్డు అదుపు లేకుండా పెరిగిపోతున్నాయి. మహిళా రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. గురుకులాల్లో విద్యార్థినులు బలవన్మరణాలకు పాల్పడుతుండటం దారుణం. మహిళా సాధికారికత, భద్రత మాటలకే పరిమితమైంది. ఈ ప్రభుత్వానికి నిజంగా మహిళల పట్ల గౌరవం ఉంటే, వారి సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే నేడు జరిగే ఇందిరా మహిళా శక్తి వేడుకల్లో ఈ హామీల అమలు ఖచ్చితమైన తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ చేసిన మోసానికి గాను నేడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా జరిగే మహిళా దినోత్సవ వేడుకల్లో యావత్ కాంగ్రెస్ పార్టీ తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# మహిళలు శక్తి స్వరూపాలు..

మొదటిపేజి తరువాయి

పార్టీ బీజేపీ కానేకాదని అన్నారు. స్త్రీలను లక్ష్మీ, సరస్వతి, దుర్గామాతగా పూజించే పార్టీ బీజేపీ అని తెలిపారు. ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్మును ఈ దేశ ప్రథమ పౌరురాలిగా చేసిన పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. ఏ మహిళల చేతిలో డబ్బు ఉందో ఆ కుటుంబం, ఆ దేశం సురక్షితంగా, ప్రగతి పథంలో నడుస్తుందని నమ్మి ఆచరిస్తున్న వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అని తెలిపారు. మహిళకు ఆర్థిక మంత్రి పగ్గాలు అప్పగించడంతో పాటు కేంద్ర కేబినెట్‌లో, ప్రభుత్వ పదవుల్లో సముచిత భాగస్వామ్యం కల్పించారని బండి సంజయ్ వెల్లడించారు.

దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇండ్లను కట్టించి మహిళల పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసి ఇంటి తాళాలు అప్పగించడంతోపాటు.. మరో 3 కోట్ల ఇండ్లను నిర్మించి మహిళలకు అందజేసేందుకు సిద్ధమైన నాయకుడు మోదీ అని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. మహిళల పేరుతో 8 కోట్ల కుటుంబాలకు నల్లా కనక్షన్లు, 25 కోట్ల మంది స్త్రీలకు జన్ ధన్ బ్యాంక్ అకౌంట్లు, దాదాపు 25 కోట్ల మంది మహిళలకు 10 లక్షల కోట్ల రూపాయలను ప్రధాన మంత్రి ముద్రా యోజన కింద ఎలాంటి పూచికత్తు లేకుండా రుణాలిచ్చి.. అక్కా చెల్లెళ్లు ఎవరిపైనా ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడేలా చేస్తూ ''మహిళా శక్తి''కి అసలైన నిర్వచనం చెబుతూ మహిళా సాధికారత అంటే ఏమిటో చేతల్లో చూపుతున్న మహనీయుడు అని పొగిడారు. దేశంలోని 11 కోట్ల మంది ఉజ్వల కనెక్షన్లు అందించి కట్టెల పొయ్యి బాధ లేకుండా చేసి మహిళల కంట కన్నీరు తుడిచింది మోదీ అని పేర్కొన్నారు. బేటీ బచావో బేటి బచావో, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన వంటి పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నారని బండి సంజయ్ తెలిపారు.

'మహిళా శక్తి' అంటే మహిళా దినోత్సవం నాడే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి.. పత్రికల్లో, టీవీల్లో పెద్ద పెద్ద ప్రకటనలిస్తూ ప్రచారం చేసుకోవడం కాదని బండి సంజయ్ అన్నారు. ఆచరణలో చూపాలి.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు ప్రతినెలా రూ.2500లు ఇస్తామన్నారు.. 15 నెలలైనా నయాపైసా ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రతి మహిళకు తులం బంగారం, స్కూటీ ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఆరోపించారు. బడ్జెట్‌లో మహిళా సంక్షేమానికి తగిన నిధులు ఖర్చు చేయడం లేదు.. మద్యం ఏరులై పారి మహిళల జీవితాలు ఛిద్రమవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి వస్తే బెల్టు షాపులు లేకుండా చేస్తామని ఇచ్చిన హామీని గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేలా చేయకుండా మహిళా దినోత్సవం నాడు మాత్రమే 'మహిళలను శక్తి'గా మారుస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు, పెద్ద పెద్ద ప్రకటనలు, హోర్డింగ్స్, ఫెక్సీలు, సభలు, సమావేశాలు పెడితే నమ్మేదెవరు..? అని విమర్శించారు. రాణిరుద్రమదేవి వారసత్వం పుణికి పుచ్చుకున్న తెలంగాణ మహిళలు చైతన్యవంతులు అని అన్నారు. మాటలతో మభ్యపెట్టే పాలకులకు, పార్టీలకు సమయం రాగానే కర్రు కాల్చివాత పెట్టడం తథ్యం అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో నిత్యం కరెంట్ కోతలు

- బీఆర్ఎస్ లీడర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్
- కాంగ్రెస్ సర్కార్ సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు

**తెలంగాణ బ్యూరో మార్చి 08(ప్రజాక్షేత్రం):** రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిత్యం ఏదో ఒక చోట కరెంట్ కోతలు ఉంటున్నాయి. నిమిషాల పాటు కాదు గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. కరెంట్ కోతలపై బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లో బండ్లగూడ ఏరియాలో రెండు గంటల్లో ఆరు (6) సార్లు కరెంటు పోయింది మీరు కోతలుఎగవేతల సీఎం కాకపోతే మరేంది అని ప్రశ్నించారు. మీ పాలనంతా అంధకారమే అని సీఎం రేవంత్ రెడ్డిని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఇక కేసీఆర్ పాలనలో 24 గంటల నిరంతర కరెంటుతో పదేండ్ల పాటు గుండెలపై చెయ్యేసుకొని కంటి నిండా నిద్రపోయిన రైతన్నకు.. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది రేవంత్ సర్కార్. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే వ్యవస్థలన్నీ అస్తవ్యస్తం కావడంతో ఓవైపు భూగర్భ జలాలు అడుగంటి, మరోవైపు కరెంటు కోతలతో పంటలకు నీళ్లందక పచ్చని పొలాలు ఎండిపోయి దిక్కుతోచని స్థితిలో తెలంగాణ రైతాంగం ఉండిపోయింది. కడుపుమండి అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు.

# కేసీఆర్ అసెంబ్లీకి ఎప్పుడు వస్తారు? మేం ఎదురుచూస్తున్నాం

కేసీఆర్ చేసిన తప్పులకు మేం మాటలు పడుతున్నాం

కాంట్రాక్టర్‌ల బిల్లులు పెండింగ్ పెట్టింది ఎవరు?

మీరు చేసిన కర్మల వల్ల మేం ఢిల్లీకి పోతున్నాం

ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలు

**తెలంగాణ బ్యూరో మార్చి 08(ప్రజాక్షేత్రం):** కేసీఆర్ అసెంబ్లీకి ఎప్పుడు వస్తారా? అని తాము కూడా ఎదురుచూస్తున్నామని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. మీరు అసెంబ్లీకి వచ్చి కూసుంటే.. అన్ని సమస్యలకూ పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. మీరు ఏడు లక్షల కోట్లు చేసింది మీరే కాబట్టి.. ఏం చేశారో చెప్పాలన్నారు. ఇప్పటికీ కూడా కేసీఆర్ జనం అధికారం నుంచి తరిమేశారు అనే అనుకోవడం లేదని.. జనం మమ్మల్ని మిస్ అయ్యారు అనే అనుకుంటున్నారన్నారు. తప్పేంటి.. ఒప్పేంటి అనే చర్చ లేదని.. కేసీఆర్ మాటలకే అంకితం.. చిత్తశుద్ధి ఉండి ఉంటే.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.

"ఎంపీ ఎన్నికల్లో గుండు సున్న. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ నే చేయలేదు. కేసీఆర్ చేసిన తప్పులకు మేము మాటలు పడుతున్నాం. కాంట్రాక్టర్‌ల బిల్లులు పెండింగ్ పెట్టింది ఎవరు? మీరు చేసిన కర్మల వల్ల.. మేము ఢిల్లీకి పోతున్నాం. కార్ లోన్ కూడా 12 శాతం కి అప్పు తీసుకోము. రాష్ట్రం కోసం 12 శాతం వడ్డీతో రుణాలు తీసుకుంటారా? కాంట్రాక్టర్ లను థర్డ్ పార్టీ ప్రోత్సహించి పంపారు. మహేశ్వర్ రెడ్డి.. బీజేపీలో ఉనికి కోసం మాట్లాడుతున్నాడు. ఆయన బీజేపీ ఆఫిస్ లో మాట్లాడే అవకాశమే లేదని బయట మాట్లాడుకుంటున్నారు. ఆయన గురించి మాట్లాడి వేస్ట్" అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.



# ఆర్ఆర్ఆర్ గురించి నితిన్ గడ్కరీతో చర్చించాం

- జాతీయ రహదారులను విస్తరిస్తాం
- రాష్ట్ర ప్రభుత్వం ఫైఓవర్ల కింద భూసేకరణ
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**నేషనల్ బ్యూరో, మార్చి 08(ప్రజాక్షేత్రం):** రీజినల్ రింగ్ రోడ్డు గురించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించామని.. ఫైనాన్స్‌కు సంబంధించిన ట్రైపార్టీ అగ్రిమెంట్ జరగాల్సి ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని గడ్కరీకి విజ్ఞప్తి చేశామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో 10 జాతీయ రహదారులను పూర్తి చేశాం. పార్లమెంట్ సమావేశాల అనంతరం ఈ 10 జాతీయ రహదారులను ప్రారంభిస్తాం. ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వస్తానని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంపై గడ్కరీతో చర్చించాం. ఉత్తర భాగం భూ సేకరణకు సంబంధించి 50 శాతం వ్యయాన్ని కేంద్రం భరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఫ్లైఓవర్ల కింద భూసేకరణ పూర్తి చేయాలి. అలా చేస్తేనే వాటి కింద రోడ్డు వేయడానికి ఆస్కారం ఉంటుంది. ఆరు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తికాకపోవడంతో అంబర్‌పేట ఫ్లైఓవర్ కింది భాగం పూర్తి కాలేదు.

హైదరాబాద్‌పుణే మార్గంలో బీహెచ్‌ఈఎల్ వద్ద (జాతీయ రహదారి 65) ఫ్లైఓవర్ పూర్తి అయ్యింది. ఈ ఫ్లైఓవర్ వద్ద సిగ్నల్ ఫ్రీగా వెళ్లొచ్చు. పారిశ్రామిక అవసరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జాతీయ రహదారి 61 (17 కి.మీ), ఎన్‌హెచ్ 65 (22 కి.మీ.) పూర్తి అయ్యింది. జనగాం దుద్దెడ మార్గంలో భూసేకరణ పూర్తి చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా భూసేకరణ చేసి ఇస్తే.. అంతే త్వరగా రోడ్డు పూర్తి చేస్తాం. ఖమ్మం విజయవాడ మధ్య వెంకటాయపల్లి నుంచి బ్రాహ్మణపల్లి వరకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

# ఆ బస్సులకు సకాలంలో కిరాయి చెల్లిస్తారా?: ఎమ్మెల్సీ కవిత

**తెలంగాణ బ్యూరో మార్చి 08(ప్రజాక్షేత్రం):** మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయకపోవడంతో మహిళలు రాజకీయంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత (Kavitha) అన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని జనగణనతో ముడిపెట్టి కేంద్రం ఇప్పటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు అమలుకానందు వల్ల మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యాన వంటి ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో మహిళలు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. జనగణనకు బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనగణన త్వరగా పూర్తిచేస్తే.. రాబోయే బీహార్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో మరింత మంది మహిళలు ఎమ్మెల్యేలుగా అవుతారన్నారు.

ప్రతీ మహిళకు రూ.2500 ఇస్తామన్న హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతామని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా కిరాయికి తీసుకుంటున్న బస్సులకు ఆర్టీసీ సకాలంలో కిరాయి చెల్లిస్తుందో లేదో స్పష్టత ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచకపోవడం సరికాదని విమర్శించారు. మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారో నిర్దిష్టమైన ప్రణాళికను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ మహిళా కేంద్రీకృత పాలన చేశారని వెల్లడించారు. మహిళల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. కేసీఆర్ పెట్టిన పథకాలను తీసేసే కర్కోటక ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో మహిళా, పురుషుల సమానత్వపు బొమ్మలు ప్రచురిస్తున్నారని వెల్లడించారు. అలాంటి చర్యలు తెలంగాణలో కూడా రావాల్సి ఉందన్నారు.

'సమాజం ఎదుగుదలలో మహిళల పాత్ర గణనీయం. ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు సమాన హక్కులు, గౌరవం, నిర్ణయాధికారం రావాల్సి ఉంది. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. చిట్యాల ఐలమ్మ, రాణి రుద్రమాదేవి వంటి వీర మహిళలు తెలంగాణ గడ్డపై పుట్టడం మనకు గర్వకారణం. మహిళలకు కుల మతాలు లేవు.. మహిళలది ఒకే కులం. మహిళలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలి. ఇళ్లలో మహిళలు ద్వితియ శ్రేణి పౌరులుగా ఉంటున్నారన్న వాదన వీగిపోవాలి. అమెరికాలో 40 శాతం మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే, భారత్‌లో మాత్రం అది 17 శాతంగానే ఉంది. దేశంలో 50 శాతం మహిళలు ఉద్యగాలు చేస్తే దేశ జీడీపీకి మనం 5 లక్షల కోట్ల ఆదాయం ఇవ్వగలుగుతాం. కానీ మహిళలు ఉద్యోగాలు చేయదగడానికి గల సౌకర్యాలు ఉన్నాయా అన్నది ఆలోచించాలి. భూగర్భ గనులల్లో పనిచేయడం నుంచి అంతరిక్షంలోకి వెళ్లే వరకు మహిళలు ఎదిగారు. అయినా అనేక అవాంతరాలు ఉన్నాయి. వాటిని అధిగమించాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు.



# మాట ఇస్తున్నా.. కోటీశ్వరుల్ని చేస్తా

మొదటి పేజి తరువాయి



కుందేళ్లు కాదు.. వారు వ్యాపారవేత్తలుగా రాణిస్తారని ప్రభుత్వం వారిని ప్రోత్సహిస్తోంది. అదానీ, అంబానీలతో వ్యాపారంలో మహిళలు పోటీపడేలా కార్యాచరణ తీసుకుంటున్నాం. రెండున్నరేళ్లలో యూనివర్సిటీలో నిర్మాణాలు పూర్తి కావాలని అధికారులకు ఆదేశాలు ఇస్తున్నా. నిధులకు ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత నాది. చదువుల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకిరావాల్సిన బాధ్యత మీది' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**శుభవార్త చెప్పిన సీఎం**

అదేవిధంగా సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి సభలో కూడా ఆయన పాల్గొని ప్రసంగించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తేనే రాష్ట్రం 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ అవుతుందని కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయించామంటూ వారికి శుభవార్త చెప్పారు. ఆడ బిడ్డలు తలచుకుంటే వన్ ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ సాధన పెద్ద కష్టం కాదన్నారు. 65 లక్షల మంది స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారన్నారు. పాఠశాలల నిర్వహణ, బడి పిల్లలకు కోటి 30లక్షల జతల యూనిఫామ్ కుట్టించే పని మహిళలకే అప్పగించామన్నారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఉండాలని సోనియాగాంధీ కృషి చేశారన్నారు. ఇందిరను అమ్మా.. ఎన్టీఆర్‌ను అన్నా.. తనను రేవంతన్న అని అంటున్నారన్నారు. మీతో పేగుబంధం కలిగిన మీ అన్నగా మాట ఇస్తున్నా.. మిమ్మల్ని కోటీశ్వరుల్ని చేస్తానంటూ వారికి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# ఢిల్లీలో అర్హులైన మహిళలకు నెలకు రూ. 2500

- సీఎం రేఖా గుప్తా
- మంత్రివర్గం ఆమోదం

**నేషనల్ బ్యూరో, మార్చి 08(ప్రజాక్షేత్రం):** ఢిల్లీలో అర్హులైన మహిళలకు నెలకు రూ. 2500 ఆర్థిక సాయం అందజేస్తామని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మహిళా సమృద్ధి యోజనను త్వరలోనే అమలు చేస్తామని పేర్కొన్నారు. రూ. 5100 కోట్లను కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీలో పేద మహిళలకు ఆర్థిక సాయం పథకాన్ని ఆమోదించింది. ఈ పథకం అమలును పర్యవేక్షించేందుకు తన నేతృత్వంలో ఓ కమిటీ ఏర్పాటు చేశాం అని ముఖ్యమంత్రి రేఖా గుప్తా పేర్కొన్నారు.

త్వరలోనే వెబ్ పోర్టల్ అందుబాటులోకి తెస్తాం.. ఇందులో అశీష్ సూద్, పర్వేశ్ వర్మ, కపిల్ మిశ్రా వంటి సీనియర్ మంత్రులు కూడా ఉన్నారని చెప్పారు. ఈ పథకం కింద పేర్ల నమోదు కేసం ప్రత్యేకంగా వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. దిల్లీ మహిళలకు ఆర్థిక సాయం పథకం ఆమోదం పొందిన విషయాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వెల్లడించారు. ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం అందజేస్తామని బీజేపీ ప్రచారం చేసింది.

# గుజరాత్ కాంగ్రెస్ నేతలు బీజేపీతో చేతులు కలిపారు

- సగం మంది పైగా ఇలానే ఉన్నారు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు
- కొందరు బీజేపీకి బీ-టీమ్ గా మారారని సొంతపార్టీ నేతలపైనే విమర్శలు
- నకిలీ నేతలకు బుద్ధి చెప్పాలి
- గుజరాత్ లో 30 ఏళ్లుగా బీజేపీ పాలనలో విఫలమైంది

**నేషనల్ బ్యూరో, మార్చి 08(ప్రజాక్షేత్రం):** గుజరాత్ కాంగ్రెస్ నేతలపై ఆ పార్టీ అగ్ర నేత లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గుజరాత్‌లో సగం మంది కాంగ్రెస్ నేతలు బీజేపీతో చేతులు కలిపారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గుజరాత్ లో పర్యటించిన రాహుల్ గాంధీ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. శనివారం పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరు బీజేపీకి బీటీమ్‌గా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. నకిలీ నేతలకు బుద్ధి చెప్పకపోతే గుజరాత్ ప్రజల మనసు గెలుచుకోలేమని తెలిపారు. కాంగ్రెస్‌లో ఉంటూ బీజేపీ కోసం పని చేస్తున్న కార్యకర్తలను, నేతలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. మన బాధ్యతలు నెరవేర్చేంత వరకు అధికారం ఇవ్వమని గుజరాత్ ప్రజలను అడగకూడదని వ్యాఖ్యానించారు. తమ పార్టీ బాధ్యతలు నెరవేర్చే వరకు రాష్ట్ర ప్రజలు తమకు ఓటు వేయరని రాహుల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**మూడు దశాబ్దాల బీజేపీ పాలన విఫలం**

మూడు దశాబ్దాలుగా బీజేపీ అందించిన పాలన విఫలమైందని.. గుజరాత్ ప్రజలు కొత్త విజన్ కోసం వేచి చూస్తున్నారని అన్నారు. ఆశించిన విధంగా రాష్ట్రం ప్రగతి సాధించడం లేదని, కాంగ్రెస్ అందుకు సరైన మార్గాన్ని చూపించలేకపోతోందని అభిప్రాయపడ్డారు. గుజరాత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో రెండు రకాలున్నారు. నిజాయతీగా పనిచేస్తూ ప్రజలను గౌరవిస్తూ వారి కోసం పోరాడుతూ పార్టీ సిద్ధాంతాన్ని తమ గుండెల్లో పెట్టుకునేవారు ఒకరు. రెండో రకానికి వస్తే ప్రజలతో సంబంధాలు కొనసాగించకుండా వారితో దూరంగా ఉండటమే కాకుండా గౌరవం కూడా ఇవ్వరు. సగం మంది బీజేపీతో ఉన్నారని కీలక వ్యాఖ్యలు చేశారు.

# పదేళ్లుగా మహిళల అభివృద్ధికి ఎంతో చేశాం



- గుజరాత్ లో ప్రధాని నరేంద్ర మోడీ
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుజరాత్ లోని నవసారి బహిరంగ సభ
- త్రిపుల్ తలాక్ కు వ్యతిరేకంగా చట్టం తెచ్చి లక్షల ముస్లిం మహిళల జీవితాల్ని కాపాడాం

**నేషనల్ బ్యూరో, మార్చి 08(ప్రజాక్షేత్రం):** గత పదేళ్లుగా మహిళ భద్రత కోసం తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అత్యాచారం వంటి క్రూరమైన నేరాల్లో మరణశిక్ష విధించేలా చట్టాలను సవరించామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని నవసారిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడిన ఆయన.. మహిళల నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. 'ఒక అమ్మాయి ఆలస్యంగా ఇంటికి వస్తే.. తల్లిదండ్రులు ఆమెను ప్రశ్నిస్తారు. కానీ, అబ్బాయిల విషయంలో మాత్రం అలా జరగదు. కానీ, వారిని కూడా ప్రశ్నించాలి. గడిచిన దశాబ్దంలో మహిళల భద్రత, మహిళలపై జరుగుతోన్న నేరాలను అరికట్టేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాం. నిబంధనలు, చట్టాలు కూడా మార్చాం. అత్యాచారం వంటి తీవ్రమైన నేరాల్లో మరణశిక్ష విధించేలా చట్టాలు సవరించాం'' అని ప్రధాని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు మరింత సాధికారత కల్పించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. దేశ ఆత్మ గ్రామాల్లో ఉందని గాంధీజీ చెప్పిన మాటను గుర్తు చేసిన ఆయన.. మహిళలు మన గ్రామీణ ప్రాంతాలకు ఆత్మగా దానికి జత చేయాలనుకుంటున్నానని చెప్పారు. త్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా చట్టం తీసుకువచ్చి లక్షల మంది ముస్లిం మహిళల జీవితాలు నాశనం కాకుండా కాపాడామన్నారు. మహిళల సారథ్యంలోని ఎన్నో సంస్థలు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. కోట్లాది మంది తల్లులు, సోదరీమణుల ఆశీర్వాదం కలిగిన తాను ప్రపంచంలోనే అత్యంత ధనికుడినని కార్యక్రమ ఆరంభంలో ప్రధాని మోదీ చెప్పారు.

## డాక్టర్ మణి భూషణ్ చిల్డ్రన్ టూరిజం క్లబ్స్ (సీటీసీ) లోగో ఆవిష్కరణ

**వైభవంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం**

**విశాఖపట్నం,మార్చి 8(ప్రజాక్షేత్రం):** నగరానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ వారి నిర్వహణ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం మరియు వి టి టి ఎఫ్ సక్సెస్ మీట్ స్థానిక దసపల్లా హోటల్ లో ప్రముఖ దర్శకుడు , జాతీయ,రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీత , ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ మణి భూషణ్ అద్వర్యం లో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిధి వాస్తు బ్రహ్మ డాక్టర్ నారాయణ మూర్తి పట్నాయక్ మరియు సామజిక, సాహితి వేత్త శ్రీమతి జాలాది విజయ మరియు ఏ ఎం ప్రసాద్ హాజరయ్యారు వారి చేతుల మీదుగా డాక్టర్ మణి భూషణ్ యొక్క చిల్డ్రన్ టూరిజం క్లబ్స్ (సీటీసీ) లోగో ఆవిష్కరణ అంగరంగ వైభవంగా జరిపారు. ఈ సందర్బంగా జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం లో ఉత్తమ సేవలు అందిస్తూ విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ తో భాగస్వామ్యం అయిన ప్రతిభ కలిగిన నారిమణులకు అవార్డు లు అంద జేశారు . ఈ సందర్బంగా డాక్టర్ మణి భూషణ్ మాట్లాడుతూ మహిళలకు పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందించి, వారి నైపుణ్య శిక్షణ ఇచ్చి, పారిశ్రామిక వేత్తలుగా లేదా స్వయం సేవ సంఘాలుగా ఏర్పడి జీవన ప్రమాణ స్థాయిని పెంచుకునేలా , ఆనందం, ఆరోగ్యం, ఆదాయం పొందేలా గ్రామీణ ,పట్టణ మహిళలకు ఉపాధి కల్పించే ఏకైక మార్గం చిల్డ్రన్ టూరిజం క్లబ్స్ (సీటీసీ) అయ్యేలా ప్రణాళికలు తయారు చేస్తున్నా మని , చిన్నపిల్లకు పర్యాటకం పై అవగాహనా మరియు ఉపాధి మార్గాలను చిన్నతనం నుండే తెలియపరిస్తే ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని , ప్రతి ఒక్క విద్యార్థి తన స్వశక్తి తో పారిశ్రామిక వేత్తగా తయారు అవుతారని , ఈ కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యం అదేనని ఇటీవల తమ సంస్థ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తో అవగహన ఒప్పందం చేసుకొని పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేసే ఏకైక స్వచ్ఛంద సంస్థ (వి టి టి ఎఫ్) గా గుర్తింపు పొంది అందరి మన్ననలు అందుకుంది, అందుకే ఈ సక్సెస్ మీట్ ఏర్పాటు చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో పర్యాటకం మరియు కృత్రిమ మేధస్సు ఉపయోగం పై చాల వినూత్న కార్యక్రమాలు రూపుద్దికోబోతున్నాయని తెలిపారు. సీటీసీ గూర్చి మరిన్ని వివరాలు త్వరలో తెలియపరుస్తామని కేవలం ఈరోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్బంగా లోగో లాంచ్ చేశామని తెలిపారు . ఎవ్వరైనా భాగస్వామ్యం అవ్వాలని ఉంటె 9848418582 కాల్ చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సీఈఓ సీత రామ స్వామి , ఎడిటర్ నీరజ , హీరో నిర్మాత ఆదిత్య భూషణ్ , అడ్మిన్ సత్యవాణి , లీగల్ అడ్వైసర్ ప్రవీణ , ప్రముఖులు ,శ్రేయోభిలాషులు అధికసంఖ్యలో హాజరయ్యి జయప్రదం చేసారు మరియి డాక్టర్ మణి భూషణ్ కి శుభాకాంక్షలు తెలియజేసారు.




## రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం

**మహిళా రైతులకు శాలువతో సన్మానం.**

**కొండాపూర్,మార్చి 08 (ప్రజాక్షేత్రం):** మండల పరిధిలోని ఎదురు గూడం గ్రామంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కే రాజయ్య ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు జరిపారు.మహిళా రైతులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగ మహిళలు అనేవారు చాలా చైతన్యవంతురాలని అనేకమంది స్వతంత్ర ఉద్యమంలో కూడా మహిళల పాత్ర చాలా కీలకంగా ఉందని అన్నారు ప్రతి ఒక్క మహిళ కూడా పురుషులతో సమానంగా ప్రతి రంగంలో కూడా ముందుండాలని సమాజం పట్ల సేవ గుణం ఉండాలి అని అన్నారు మహిళలు చేస్తున్నటువంటి ప్రతి పనిలో వ్యవసాయ రంగాలలో ఉద్యోగాలలో వ్యాపారస్తులలో ఉన్నతమైన పదవులలో ఉండాలని కోరారు. చిన్నప్పటినుండి మహిళలు చైతన్యవంతం వైపు అడుగు వేయగల ని కోరారు మహిళలు లేకపోతే ఈ సృష్టి లేదా అని మహిళలని సమాజంలో గౌరవించాలి అని కోరారు. మహిళలు ఏ రంగంలో కూడా తక్కువ కాదని ప్రతి ఒక్కరూ ముందుండాలని నిరూపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు యేసు రత్నం,రైతు మహిళలు బి పద్మ, పి శాంతమ్మ, పేట లక్ష్మి, కర్ణమ్మ, మల్లేశ్వరి, దీనమ్మ, దీనమ్మ తదితరులు పాల్గొన్నారు.



## పండగ ఖర్చులకు రూ.5వేలు ఆర్థిక సాయం

### మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి దాతృత్వం పై ప్రశంసలు

**విశాఖపట్నం,మార్చి 08(ప్రజాక్షేత్రం):** సేవ చేయడంలో ముందుండే మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ 35 వార్డుల నేతల ఆధ్వర్యంలో ఇరువురికి పండుగ ఖర్చులకు ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. ఆసీలమెట్ట కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ. 5 వేలు నగదును స్వయంగా వాసుపల్లి గణేష్ కుమార్ అందజేశారు.కుల మతాలకు అతీతంగా, ప్రజాసేవే పరమావధిగా సాయం అంటే తన వద్దకు వచ్చే వారికి సొంత నిధులతో చేయూతనందిస్తున్నారు. వాసుపల్లి గణేష్ కుమార్ సేవా కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. అధికారంలో లేకున్నా తన ప్రజలకు అండగా నిలబడాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్న వాసుపల్లి గణేష్ కుమార్ చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు ప్రశంసిస్తున్నారు.ఈ కార్యక్రమంలో వై ఎస్ ఆర్ సి పి విశాఖ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్,జిల్లా కార్యదర్శి ఆది విష్ణు రెడ్డి,సౌత్ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు సువార్త రాజు, ఎర్రినమ్మ తల్లి గుడి చైర్మన్ లండ రమణ,34వ వార్డ్ అధ్యక్షులు అలుపన కనకా రెడ్డి ,లింగం శ్రీను,అరుగుల రాజు,బోర శ్రీనివాస్ రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.







# అంధత్వ నివారణకు చేయూత

- ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం.
- గ్రామీణ ప్రజల్లో నూతన ఉత్తేజం నింపుతున్న వైద్య శిబిరాలు.
- పేదలకు వృద్ధులకు దివ్య ఔషధంగా మారిన ఉచిత కంటి వైద్య శిబిరాలు.
- సమస్య తీవ్రతను బట్టి శస్త్ర చికిత్స చేయించి ఇంటికి పంపిస్తాము.. ఎల్ఎన్ఆర్ వ్యవస్థాపకులు నర్సింలు వెల్లడి.
- ఉచిత కంటి వైద్య శిబిరాలు వృద్ధులకు నిస్సహాయకులకు గొప్పవరం.
- మాజీ పశుగాణ అభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణరెడ్డి.

**పెద్దేముల్ మార్చ్ 8(ప్రజాక్షేత్రం):** అందత్వ నివారణకు చేయూత అందిస్తూ..గ్రామీణ ప్రజల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతున్న ఎల్ఎన్ఆర్ యువసేన బృందం.పెద్దేముల్ మండల పరిధిలోని ఘాజీపూర్ గ్రామంలో శనివారం శంకర కంటి ఆస్పత్రి హైదరాబాద్ వారి సౌజన్యం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ పశుగాన అభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణరెడ్డి, ఎల్ఎన్ఆర్ వ్యవస్థాపకులు లొంక నర్సింలు తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎల్ఎన్ఆర్ వ్యవస్థాపకుడు నర్సింలు మాట్లాడుతూ... గ్రామంలో ఉన్న పేద ప్రజలకు, నిస్సహాయకులకు, వృద్ధులకు ముందుగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి.. సమస్య తీవ్రతను బట్టి.. చిన్నచిన్న కంటి సమస్యలతో బాధపడుతూ ఉన్నవారికి తగిన మందులు ఇవ్వడం జరిగింది అని పేర్కొన్నారు.దృష్టిలోపం ఉన్నవారికి కళ్లద్దాలు అందజేయడం జరిగిందని అన్నారు.ఎక్కువ కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి హైదరాబాద్ లోని శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించి, సురక్షితంగా ఇంటికి పంపించడం జరుగుతుందని ఎవరు కూడా అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని మనోధైర్యాన్ని కల్పించారు. భవిష్యత్తులో ఇంకా మండల పరిధిలోని అన్ని గ్రామాలలో పేద ప్రజల కోసం, వృద్ధుల అందత్వ నివారణకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం అని లోంక నర్సింలు చేస్తున్న సేవలకు.. ప్రజలలో ఎంతో విశ్వాసం పెరిగిందని ప్రశంసించారు. ఇంత గొప్ప సేవా కార్యక్రమాన్ని ఘాజీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసినందుకు మనస్ఫూర్తిగా గ్రామ ప్రజల పక్షాన ధన్యవాదాలు అంటూ నర్సింలు సేవలను అభినందించారు. శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో మొత్తం 300 మందికి పరీక్షలు నిర్వహించి, 50 మందికి ఆపరేషన్ గురించి హైదరాబాద్ లోని శంకర కంటి ఆసుపత్రికి పంపించటం జరిగిందని ఎల్ఎన్ఆర్ వ్యవస్థాపకులు నరసింహులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎల్ఎన్ఆర్ యువసేన వ్యవస్థాపకులు లోంక నర్సింలు, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు నసీరుద్దీన్, నాయకులు లాల్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి,యూత్ ప్రెసిడెంట్ మహేశ్,సంగమేశ్వర్ ,నాగభూణం, బంగారు నర్సింహులు, రవి,రామకృష్ణ, రాములు, ప్రవీణ, రాము, జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చలో ఖమ్మం.. ఈ నెల 11న జరుగు రాయల సుభాష్ చంద్రబోస్ రవన్న తొమ్మిదవ వర్ధంతి సభ గోడ పత్రికను విడుదల చేసిన సిపిఐ, ఎంఎల్,న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు

**గద్వాల,మార్చి 08(ప్రజాక్షేత్రం):** చలో ఖమ్మం ఈ నెల 11 వ తేదిన జరుగు రాయల సుభాష్ చంద్రబోస్ రవన్న తొమ్మిదవ వర్ధంతి సభ గోడ పత్రికను గద్వాల జిల్లా కేంద్రంలో సిపిఐ,ఎం ఎల్,న్యుడెమోక్రసీ పార్టీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు జమ్మిచెడ్ కార్తీక్ మాట్లాడుతూ.. సిపిఐ,ఎంఎల్, న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి ప్రతిఘటన పోరాట యోధుడు అజ్ఞాత దళపతి అమరుడు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్ర బోస్ (రవన్న) తొమ్మిదవ వర్ధంతి ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరుగుతుంది అని అన్నారు. భూమికోసం భుక్తి కోసం ఈ దేశ ప్రజల విముక్తి కోసం సాయుధ పోరాటమే నిజమైన పోరాటపందాన్ని దృఢంగా నమ్మి ఆచరించి నక్సల్ బరి శ్రీకాకుళం తెలంగాణ సాయుధ పోరాట పందా వెలుగులో దున్నేవానికి భూమి కావాలని గోదావరి లోయ ప్రతిఘటన పోరాటపంద మార్గంలో 50 సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపి ఆదివాసి హరిజన గిరిజన కార్మిక కర్షక విద్యార్థి యువజన మహిళ పేద ప్రజల కోసం నిత్యనిర్బంధా లను ఎన్కౌంటర్లను రాజ్యంసను ఎదుర్కొని సమరశీల ఉద్యమాలు నిర్వహించి ఆదర్శ విప్లవ కమ్యూనిస్టు యోధునిగా ప్రజల గుండెలలో నిలచిపోయినాడని, ఆయన చూయించిన బాటలో మనమందరం ఐక్యమై పోరాటాలు నిర్వహించిన నాడే ఆయనకు మనం ఇచ్చే నివాళి,కామ్రేడ్ రవన్న చూపిన ప్రతిఘటన పోరాటపు వెలుగులో మనమందరం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.1132025 న ఖమ్మం లో జరుగు రవన్న 9 వర్ధంతి సభలో అధిక సంఖ్యలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి,జమ్మిచెడ్ కార్తీక్,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు బీరెల్లి దానయ్య, హరీష్ కుమార్,గంజిపేట కోలా అంజి,జమ్మి చెడు రామకృష్ణ, పగుల్ రాజ్,రంగస్వామి, మల్లెం దొడ్డి రాముడు, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టిఐ గద్వాల తాలూకా ఇన్చార్జిగా మున్నూరు రవి నియామకం

**గద్వాల,మార్చి 08(ప్రజాక్షేత్రం):** ఆర్టిఐ గద్వాల తాలూకా ఇన్చార్జిగా మున్నూరు రవి ని నియమించినట్లు ఆర్టిఐ పరిరక్షణ చట్టం జాతీయ అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆర్ టి ఐ గద్వాల తాలూకా ఇన్చార్జ్ మున్నూరు రవి మాట్లాడుతూ గద్వాల తాలూకాలో ఆర్టిఐ కోసం నిరంతరం శ్రమిస్తానని తెలిపారు.


(RT.I.P.C-2005)
సమాచార హక్కు పరిరక్షణ చట్టం - 2005
IDENTITY CARD
ID.NO: RTIPA/TG/JGL/0127
NAME : N.RAVI
Designation : GADWAL THALUKA PRESIDENT
Valid Upto : 31-12-2025
Address : JOGULAMBA GADWAL DIST.TG

## మహిళలకు అవకాశమిస్తే అద్భుత విజయాలు సాధిస్తారు: న్యాయ విభాగ విద్యార్థిని చెన్నా ప్రణాళిక




**విశాఖప్నం,మార్చి 8(ప్రజాక్షేత్రం):** ప్రస్తుత సమాజంలో చాలా సందర్భాల్లో మహిళలు వివక్షతకు గురౌతున్నారని, ఒక్కసారి మహిళలకు అవకాశమిచ్చి చూస్తే అన్ని రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తారని న్యాయ విభాగ విద్యార్థిని చెన్నా ప్రణాళిక తెలిపారు. వి జే ఎఫ్ ప్రెస్ క్లబ్ లో హ్యూమన్ రైట్స్ సెల్, పవర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు జే. ఎం. నాయుడు, బెహరా రాధా కుమారి ల సంయుక్త ఆద్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చెన్నా ప్రణాళిక ప్రత్యేక ప్రసంగాన్ని చేసి అందరినీ ఆకట్టుకుంది. సమాజంలో స్త్రీలకు అవకాశాలు తక్కువగా ఉన్నాయని,కొన్ని పరిస్థితుల్లో అభివృద్ధిని అందుకునే సమయంలో పేదరికం,పెళ్లి, ఇతరులచే అత్యాచారం, మోసగించబడడం, వివక్షకు గురికావడం తదితరాల కారణంగా స్త్రీ వెనుకబాటును అనుభవిస్తోందని తెలిపారు. ఒక్కసారి ఆలోచించి స్త్రీలకు నచ్చిన రంగంలో ప్రోత్సహిస్తే దశ, దిశ మార్చగలిగే శక్తి మహిళకు ఉందన్నారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన మహిళలకు సత్కారం చేసారు.ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం మహిళా స్ఫూర్తితో హక్కులకై ఉద్యమించాలి:బట్టుపల్లి అనురాధ




**వలిగొండ,మార్చి 08(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా ,వలిగొండ మండల కేంద్రంలో శనివారం రోజున పాత ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో గల కళాకారుల భవనంలో, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలపై జరుగుతున్న హింస చట్టాల అమలుపై, జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ 78 సంవత్సరాల స్వాతంత్ర భారతంలో నేటికీ రెండో పౌరులుగానే పరిగణించబడుతున్నారని,మహిళా హక్కులకై మరింత ఉద్యమించాల్సిన అవసరము ఉన్నదన్నారు.నానాటికి లైంగిక దాడుల,యాసిడ్ దాడులు, పెరుగుతున్నాయి అన్నారు, స్త్రీ లేనిదే జననం లేదు,స్త్రీ లేనిదే గమనము లేదు,స్త్రీ లేనిదే అసలు సృష్టి లేదు, అడుగడుగునా స్త్రీలపై అవమానాలు కొనసాగుతున్నాయని అన్నారు.సి ఆర్ బి అనే సంస్థ నివేదిక ప్రకారం,మహిళలపై హింసకు కేసులు 4.28000, అందులో 7.9% లైంగిక దాడి కేసులు ఉన్నాయని అన్నారు, 21.8% భౌతిక దాడులు, 31.8% గృహింసకేసులు, నమోదైనయని నివేదిక తెలిపారు అన్నారు, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మహిళలకు, 2500 రూపాయలు,గ్యాస్ సబ్సిడీ సక్రమంగా లేదు, ఉచిత బస్సు అని లగ్జరీ బస్సులను నడుపుతూ డబ్బులు వసూలు చేస్తున్నారు.హామీలు అమలు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు మరియు కలుకూరి లక్ష్మమ్మ, గర్దాసునర్మదా,మెట్టు లక్ష్మమ్మ, దుబ్బలత, కవిత,కృష్ణవేణి పాల్గొన్నారు.

## మహిళ దినోత్సవాన్ని మరిచిన రాజకీయ పార్టీలు

### కొండాపూర్ మండలం మహిళలు అంటే రాజకీయ పార్టీలకు గౌరవం లేదా?

### మహిళల ఓటు అవసరం కానీ మహిళా దినోత్సవం అవసరం లేదా?



**కొండాపూర్,మార్చి 8 (ప్రజాక్షేత్రం):** కాంగ్రెస్,బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ఎన్నికల సమయంలో మహిళలకు దండాలు పెట్టి ఓటు వేయమని బతిమిలాడిన రాజకీయ మహిళా దినోత్సవాన్ని మహిళలంటే మాకేం పని అనే విధంగా రాజకీయ పార్టీలు మహిళా దినోత్సవం కొండాపూర్ మండలం లో ఎక్కడ కూడా జరపలేరు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం.నూతన సంవత్సరం లాంటి సరదాగా చిందులేసే సందర్భాలు కావు. ఈరోజు మనం అనుభవిస్తున్న మెరుగైన జీవన ప్రమాణాలకు ఎందరెందరు, ఏయే సందర్భాల్లో, ఎన్నెన్ని త్యాగాలు చేశారో గుర్తుచేసుకునే సందర్భమిది. ఇప్పుడు కూడా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, ఆర్థిక సమానత్వానికి నోచుకోని అభాగ్యుల కోసం మన వంతు కృషిగా ఏమి చేయగలమన్న ఆలోచనలకు పదును పెట్టే అవకాశాలుగా భావించాలి. చారిత్రక సందర్భాలను సామాజిక చైతన్య పూర్వక దిశలో కాకుండా సంబరాలుగా జరుపుకునే విషసంస్కృతి నేడు చాప కింద నీరులా ఆవహిస్తున్నది. స్త్రీలకు ఓటు హక్కు లేని,ఆస్తి హక్కు లేని, కనీసం ఒంటి నిండా గుడ్డలు కూడా కట్టుకునే అర్హత లేని, అందరు తినగా మిగిలినది మాత్రమే తినాలన్న నిబంధన నుండి అన్ని రంగాల్లో శాసించే స్థాయికి మహిళలు చేరుకుంటున్నారు.ఇది దానంతట అది జరిగినది కాదు.ఎందరో త్యాగాల వల్ల, మరెందరో బలిదానాల వల్ల మాత్రమే సాధించబడిందని మరిచిపోరాదు.అటువంటి గొప్ప చరిత్ర గల మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని మరచిన ప్రస్తుత రాజకీయ నాయకులు.మహిళల కార్యక్రమాలను చేయలేని నాయకులు మహిళల పట్ల రానున్న స్థానిక ఎలక్షన్లో ఓట్లను ఏమని అర్థిస్తారు.

## మల్లెపల్లి లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు.

**కొండాపూర్,మార్చి 08 (ప్రజాక్షేత్రం):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మల్లేపల్లి గ్రామంలో శనివారం గ్రామపంచాయతీ లో గ్రామపంచాయతీ కార్యదర్శి కటకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళా గ్రామసభ ఏర్పాటు చేశారు.ఈ సమావేశం లో మహిళా సమస్యలు వాటి పరిష్కారం గురించి చర్చించారు.మహిళా సంఘాలలో తీసుకునే లోన్లు సమయానికి చెల్లించాలని అన్నారు.లోన్ తీసుకొన్న వారు వ్యాపారం చేసి అభివృద్ధి చెందాలని తెలిపారు.ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి కటకం శ్రీనివాస్ విఓ లీడర్స్ సత్య, విజయలక్ష్మి,కమలమ్మ, దేవమ్మ రాణి,అంగన్వాడీ టీచర్స్ లావణ్య,మంజుల గ్రూప్ సభ్యులు స్వప్న,లక్ష్మి, మంజుల,సంగమ్మ,బాలమణి తదితరులు పాల్గొన్నారు.



## జూనియర్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే జారే

**దమ్మపేట మార్చ్08(ప్రజాక్షేత్రం):**దమ్మపేట మండలం మందలపల్లి గ్రామంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను మరియు జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, విద్య విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఉపాధ్యాయులకు పలు అంశాలపై సూచనలు చేసి హాస్టల్ లో నెలకొన్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ కి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తానని సిబ్బందికి ఎమ్మెల్యే హామి ఇచ్చారు.



## ఆధునిక మహిళలు ముందు తరాలకు ఆదర్శంగా ఉండాలి

**ఖమ్మం మార్చి 08(ప్రజాక్షేత్రం):**
తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించటం జరిగింది ఈ కార్యక్రమానికి జి ఉషశ్రీ అధ్యక్షులు పి సుధారాణి కార్యదర్శి సభను నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరి శ్రీనివాసరావు టీజీవో రాష్ట్ర అధ్యక్షులు కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాలలో రాణిస్తున్నారని సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ఉద్యోగ సంఘాలలో కూడా మహిళలు పాల్గొంటున్నారని గెజిటెడ్ విభాగంలో మహిళ విభాగం ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేసినందుకు మహిళా విభాగ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా అనేక క్రీడ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా పాల్గొని ఉత్సాహంగా ఆటలు ఆడినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ పి శ్రీజ అడిషనల్ కలెక్టర్ ఖమ్మం జిల్లా పాల్గొన్నారు మహిళా మణులలో ఉత్తేజం నింపారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ పి శ్రీజ మాట్లాడుతూ మహిళా గెజిటెడ్ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు ఖమ్మం జిల్లా పరిపాలన నిర్వహణలో మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉందని రాష్ట్రంలోని అతిపెద్ద జిల్లాలోని రెండవ జిల్లాగా ఖమ్మం జిల్లా మహిళలు పరిపాలనలో తమదైన పాత్రతో ముందుకు పోతున్నారని అభినందించారు వారు నిరంతరం కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ కూడా ఉద్యోగ బాధ్యతలలో కూడా ముందున్నారని రాబోయే తరాలకు మహిళా అధికారులు మార్గదర్శకులుగా ఉండి వారిని ముందుకు నడిపించాలని రాబోయే తరానికి నేటి మహిళలు ఆదర్శంగా ఉండాలని అన్ని రంగాలలో కూడా ముందుకు వెళ్తున్నారని మహిళలు వెనకడుగు వేయవద్దని తమ పని చేస్తున్న కార్యాలయాలలో కూడా ఎదుటివారికి ఆదర్శంగా ఉండాలని సూచించారు నేటి మహిళ యువత చాలా చిన్న వయసులోనే ఉద్యోగాలు సాధిస్తున్నారని వారిని అభినందించారు ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించని మహిళా గెజిటెడ్ అధికారులకు కలెక్టర్ అభినందించారు 22 విభాగాలలో నిర్వహించిన క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను విజేతలకు ప్రధానం చేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ కార్యదర్శి మోదుగు వేలాద్రి ట్రెజరర్ శేషు ప్రసాద్ హౌస్ బిల్లింగ్ సొసైటీ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్ జిల్లా ట్రెజరర్ రమేష్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్ మహిళా కార్యదర్శి పి సుధారాణి జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ బాబు రత్నాకర్, జి రమేష్, వెటర్నరీ వెటర్నరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మన్యం రమేష్ బాబు జిల్లా బాధ్యులు డాక్టర్ హరీష్, శ్రీనివాసరావు. కిషోర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వెంకట పుల్లయ్య .కార్యదర్శి మహేష్ .ప్రసాద్ అధ్యక్షులు సునీల్ రెడ్డి. కార్యదర్శి పుల్లయ్య . యూటీఎఫ్ రంజాన్ గారు, దేవరకొండ సైదులు.ఎస్ టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాస్ కొణిదెన శ్రీనివాస్ కార్యదర్శి ,పి ఆర్ టి యు అధ్యక్షులు వై వెంకటేశ్వర్లు .కనపర్తి వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి వీరస్వామి .జహీరుద్దీన్, డాక్టర్ సైదులు, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, మహమ్మద్ గౌస్, మోహన్, కృష్ణార్జున రావు, బాలాజీ ,జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణశ్రీ, అరుణకుమారి, వై మంజుల, నాగేంద్ర కుమారి, శారద, డాక్టర్ సుజాత, హిమ సమీరా, ప్రమీల , వాసవి రాణి, రాజ్యలక్ష్మి , శైలజ, లావణ్య, లలిత, అరుణ, రమాదేవి, విజయ్ కుమారి, షాహినా బేగం, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.నాలుగో తరగతి ఉద్యోగ సంఘ అధ్యక్షులు కాంపాటి వెంకటరమణ డ్రైవర్ సంఘం జిల్లా అధ్యక్షులు కే వెంకటేశ్వర్లు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు కోడి లింగయ్య టీఎన్జీవో నాయకులు తాళ్లూరి శ్రీకాంత్ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ ఆధ్వర్యంలో కళాబృందం వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.



## ధాత్రి రత్న అవార్డు



**ఖమ్మం మార్చి 08(ప్రజాక్షేత్రం):**విన్నపం ఒక పోరాటం ఎన్జీఓ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు కీ ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ హైదరాబాద్. ఆధ్వర్యంలో గౌరవ సన్మానం ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా కంజుమార్ రైట్స్ సెంట్రల్ ఛైర్మెన్ ప్రీతి అండ్ ఇండియన్ రెడ్ క్రాస్ ఛైర్మెన్ బీమ్ రెడ్డి చేతుల మీదగా సన్మానం జరిగింది.ఈ సందర్భంగా చీకూరి లీలావతి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఆర్గానిక్ పాడ్స్ స్కూల్స్ అండ్ కాలేజీలలో,రేషన్ ద్వారా అందించాలి, యూటెరస్ క్యాన్సర్ కి వాక్సిన్ ప్రతి అమ్మాయి కీ ఉచితంగా అందించాలి. మహిళలు ఆరోగ్యాన్ని కాపాడాల్సిన భాద్యత ప్రభుత్వానిపై ఉంది, ఎమ్మెల్సీ సీతా నీ.ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కి కేటాయించాలి అనీ ఉమెన్స్ డే సందర్భంగా ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ కారిక్రమంలో సీసీఐ ఉపాధక్షురాలు సుప్రభ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దేముల్లోని ఎస్సీ కాలనీలో భారీ అగ్నిప్రమాదం

- పశువుల పాకలో చెలరేగిన మంటలు.
- పూర్తిగా దగ్ధమైన వ్యవసాయ పనిముట్లు వరిగడ్డి కుప్ప.
- ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు బాధితుల వెల్లడి.
- సుమారు రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన.
- అధికారులు ప్రభుత్వం ఆదుకోని నష్ట పరిహారం ఇప్పించాలని బాధితుల ఆవేదన.



**పెద్దేముల్ మార్చి 8(ప్రజాక్షేత్రం):** పెద్దేముల్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది.దీంతో పశువులు తినే వరిగడ్డి, వ్యవసాయ పనిముట్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసి కొద్ది వరకు నివారించినప్పటికీ, మంటలు అదుపు కాకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా, హుటా హుట్టిన ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆరిపి అదుపులోకి తెచ్చారు. ఈ సందర్భంగా బాధితులు పిల్లి నరసప్ప మాట్లాడుతూ.. వేసవి కాలంలో పశువుల కోసమని పది బండ్ల వరిగడ్డి తీసుకొచ్చి, ఎడ్లు కట్టేసి స్థలంలో కుప్పగా పేర్చాము. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వరి కుప్పకు నిప్పు అంటించినట్లు బాధితులు పిల్లి నర్సప్ప వెల్లడించారు. ఈ క్రమంలో వరిగడ్డి, వ్యవసాయ పనిముట్లతో పాటు.. రెండు ఎడ్లకు కూడా కొద్దిపాటి గాయాలయ్యాయని తెలిపారు. దీంతో సుమారు రూ.2 లక్షల విలువైన ఆస్తి నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల స్పందించి పేదరికంలో ఉన్న మా కుటుంబానికి నష్టపరిహారం అందించాలని బాధితులు పిల్లి నరసప్ప కోరారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుక

**దమ్మపేట మార్చి08(ప్రజాక్షేత్రం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దమ్మపేట కోర్టు ప్రాంగణంలో మహిళా దినోత్సవ వేడుక నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆప్ దారా యుగేందర్ పర్యవేక్షణలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్యూడిషియల్ జూనియర్ కోర్ట్ జడ్జి బి భవాని పాల్గొన్నారు. ఆమెను పూల గుచ్చాలు ఏసి శాలువతో సత్కరించారు మహిళలు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు హింసకు గురైనప్పుడు గృహహింస చట్టం ద్వారా కావలసిన రక్షణ మనో వృత్తిలో పొందవచ్చని సూచించారు. పిండ దశ నుంచి మహిళలు దాడులు ఎదుర్కొంటున్నారని, మహిళలపై అత్యాచారాలు అరికట్టాలంటే ప్రతి మహిళ విద్యావంతులై ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరణం విడాకులు గృహహింస చట్ట వరకట్నాలకు సంబంధించిన మహిళ చట్టాలపై వివిధ రంగాలు మహిళలకు వివరించారు. స్త్రీలకు పురుషులతో పాటు ఆస్తితో సమాన హక్కు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభలు కనబరిచిన మహిళా ఉద్యోగులు ఉన్నందుకు నేను గర్వపడుతున్నాను. ఎన్నో పోరాటాలు త్యాగాలతో సాధించుకున్న అనేక హక్కులపై ప్రపంచవ్యాప్తంగా సాధించుకున్న హక్కులను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. అనంతరం లైన్స్ క్లబ్ అప్ దమ్మపేట అధ్యక్షుడు అంకత ఉమామహేశ్వర రావు. మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో కీలక బాధ్యత పోషించాలి. వంటింటికే పరిమితం కాకుండా మహిళలు ఏ విషయంలో కూడా భయపడడం ఇబ్బంది పడటం మానుకోవాలి. మహిళలు విద్య ఉద్యోగం రాజకీయాలు క్రీడలు వంటి అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పాల్గొనాలని వారి సామర్థ్యాలను పూర్తిగా వినియోగించుకోవాలని అన్నారు. నేటి పరిస్థితుల్లో ఎంతోమంది వీర మహిళలు ఎన్నో సాధించారు చరిత్రలో మరియు ప్రస్తుత ఉన్న అనేక మహిళా నాయకులు శాస్త్రవేత్తలు కళాకారులు క్రీడాకారులు వంటి అన్నిటిలో మహిళలు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. అదేవిధంగా మహిళలను ఉద్దేశించి ద్వారా యుగంధర్ మాట్లాడుతూ పురుషులు మరియు మహిళలు సమాన హక్కులు అవకాశాలను పొందినప్పుడు మాత్రమే ఒక సమాజం నిజమైన అభివృద్ధిని సాధించగలదు అని చెప్పారు. ప్రతి ఏడాది మార్చి 8 మహిళా దినోత్సవం జరుపుకోవడం అలాగే చదువు పట్ల దమ్మపేటలో వీర మహిళ ఉన్నత చదువులు చదువుకొని ప్రభుత్వ కొలువులు అందుపుచ్చుకున్న మహిళ మన దమ్మపేట కు చెందటం గర్వ కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలు,మాజీ జెడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ దారా మల్లికార్జున్ రావు, లయన్స్ క్లబ్ ఆఫ్ సభ్యులు మహిళా లాయర్లు, వీర వనితలు పాల్గొన్నారు.



## సమాజ నిర్మాణంలో స్త్రీలదే కీలక పాత్ర గుండాల కవిత

**యస్.బి.ఐ.టి. లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు.**


**ఖమ్మం మార్చి 08(ప్రజాక్షేత్రం):**స్త్రీ అనేక పాత్రలలో తన వంతుగ సమాజ నిర్మాణంలో కీలక పాత్రను పోషిస్తునట్లు యస్.బి.ఐ.టి. కళాశాల వైస్ చైర్మన్ గుండాల కవిత తెలిపారు. కుటుంబ వ్యవస్థను బలపరచడంతో ఆర్థికంగా, సామాజికంగా స్థిరమైన దేశాన్ని.నిర్మించగలుగుతన్నారని వారు అభిప్రాయపడ్డారు. శనివారం స్థానిక కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడకులలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కవిత జ్యోతి ప్రజ్వలన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ శాతాబ్దాలుగా అనుభవించిన అణిచివేతను, అసమానతలను గుర్తు చేస్తూ నేడు ఆకాశంలో సగంఅవకాశాలలో సగం అని ఉద్యమించే స్థాయికి ఎదగడానికి పోరాడిన స్త్రీ మూర్తులను వారు కొనియాడారు.మహిళలు తమపై నమ్మకం కలిగి ఉండాలని, తద్వారా స్వయం శక్తిగా ఎదిగే అవకాశం ఉందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి. ధాత్రి తెలిపారు. కేవలం 15000 మంది మహిళలతో ఆరంభమైన మహిళా ఉద్యమం నేడు ప్రపంచ వ్యాప్తంగా మహిళా దినోత్సవం జరుపుకునే స్థాయికి తీసుకురాగలిగిందని, ఇది స్త్రీ శక్తికి నిదర్శనం అని వారు అభిప్రాయపడ్డారు. అధిక పని గంటలు, తక్కువ వేతనం మరియు ఓటు హక్కు లేకపోవడం వంటి సామాజిక రుగ్మతులను ఇలా పోరాడి సాధించినవేనని వారు గుర్తు చేసారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ స్త్రీలను పూజించక పోయినా, గౌరవించటం నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపల్ డా జి. రాజ్కుమార్ మాట్లాడుతూ మహిళలు బయటి ప్రపంచాన్ని అర్థంచేసుకుని తన పాత్రను దిద్దుకోవాలని తద్వారా దేశాభివృద్ధిలో తన కంటూ స్థానాన్ని నిర్మించుకోవాలని సూచించారు. తదనంతరం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన, సాంప్రదాయ వేషధారణ మరియు వ్యాసరచన పోటీలలోని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్. డా జె. రవీంద్రబాబు, డా యన్. శ్రీనివాసరావు, మహిళా అధ్యాపకులు యస్. నాగమణి. యన్. సవిత, యస్, సరిత, పి. గ్లోరివిక్టోరియా. పి. హిమబింధు, కె. మీనా, సాహిస్తామీర్జా. విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



## ఆలయాల పవిత్రతను కాపాడుదాం.

**శ్రీరంగాపూర్ రంగనాథ ఆలయంలో ఎస్పీ రావుల గిరిధర్ శ్రమదానం.**

**వనపర్తి మార్చి 08(ప్రజాక్షేత్రం):**ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాల పవిత్రతను ప్రతి ఒక్కరు కాపాడాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పిలుపునిచ్చారు. శనివారం శ్రీరంగాపూర్ రంగనాథ ఆలయాన్ని సందర్శించి నిస్వార్థ స్వచ్ఛంద సంస్థ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాల్లో శ్రమదానం చేశారు. రానున్న రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్ర వాతావరణంలో భగవంతుడి దర్శన భాగ్యం కలిగే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆలయ నిర్వహకులకు సూచించారు. గుడి గోపురాలు, ప్రార్థనా స్థలాలు మన వారసత్వ సంపదలని చెప్పారు. 400 సంవత్సరాల చారిత్రిక నేపథ్యం కలిగిన రంగనాథ ఆలయాన్ని వనపర్తి సంస్థాన పాలకులు బహిరీ గోపాలరావు నిర్మించగా రాణి శంకరమ్మ మరింత అభివృద్ధి చేశారని తెలిపారు. ప్రకృతి సిద్ధంగా ఎంతో ఆహ్లాదకర వాతావరణం పెద్ద జలాశయం అద్భుత శిల్ప సంపద కలిగిన ఆలయాన్ని పుణ్యక్షేత్రంగా పర్యాటక కేంద్రంగా భక్తులు దర్శించుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై రామకృష్ణ నిస్వార్థ ఆర్గనైజేషన్ సభ్యులు రాజశేఖర కార్తి కళ్యాణ్ అంజి అరవింద్ ఆలయ సిబ్బంది పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## గ్రామపంచాయతీ కార్మికుల మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి

**లేనిపక్షంలో మార్చి 15 నుంచి విధుల బహిష్కరణ**

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**

**చేవెళ్ల మార్చి 08(ప్రజాక్షేత్రం):**చేవెళ్ల పట్టణ కేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ డివిజన్ ఉపాధ్యక్షులు నాగేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల తరహా గ్రీన్ ఛానల్ ద్వారా జనవరి 1 నుండి ప్రతి నెల చెల్లిస్తామని చెప్పడం జరిగింది ప్రభుత్వ మాట ప్రకారం వెంటనే వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీఓలలో నిలిచిపోయిన బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని, గ్రామపంచాయతీ బ్యాంకు ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తివేయాలని, ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఒక పూట పని విధానం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో మార్చి 15 నుంచి విధులు బహిష్కరించి ఆందోళన, పోరాటాలకు సిద్ధమవుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ డివిజన్ మహిళా కన్వీనర్ సుజాత ఉపాధ్యక్షులు నాగేష్, భూపాల్,స్వామి, రామ్ చందర్, మనీలా,సుజాత, గట్టయ్య,రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉమెన్స్ డే ఎందుకు..
## శృతీహాసన్ ఆసక్తికర వ్యాఖ్యలు



కమల్ హాసన్ కూతురిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శ్రుతీహాసన్.. తనదైన నటనతో తక్కువ సమయంలోని స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్ స్టార్ హీరోలందరితోనూ కలిసి సినిమాలు చేసింది. చివరిగా సలార్ సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. కోలీవుడ్ టు బాలీవుడ్.. అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తున్నప్పటికీ శ్రుతీ హాసన్‌పై పెద్దగా పుకార్లేవి రాలేదు. ఏ విషయంలో అయినా ఆమె నిక్కచ్చిగా ఉండమే దానికి కారణం. ఏ అంశంపై అయినా తన అభిప్రాయాన్ని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేస్తుంటారు. తాజాగా అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై కూడా శ్రుతీ తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ..అసలు ఉమెన్స్ డేని జరుపుకోవడం దేనికని ప్రశ్నించింది. మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో శ్రుతీ మాట్లాడుతూ.. 'మేల్ డే అనేది లేనప్పుడు ప్రత్యేకంగా 'ఉమెన్స్ డే' ఎందుకు ? అంటే ఇంకా స్త్రీ వెనకబడి ఉందని చెప్పడానికే ఈ స్పెషల్ డేస్ జరుపుకుంటున్నారా? అలాగే ఉమెన్ ఓరియెంటెడ్' సినిమా అంటారు. 'మేల్ ఓరియెంటెడ్' మూవీ అనరు. ముందు ఈ తేడా పోవాలి. మహిళా దినోత్సవం అనేది ప్రత్యేకంగా లేని రోజు ఉమెన్ ఎదిగినట్లు లెక్క'అని తనదైన శైలిలో చెప్పుకొచ్చింది.

# 'గేమ్ ఛేంజర్' ఫ్లాప్‌కు కారణం చెప్పిన ఆర్జీవీ

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చివరిగా 'గేమ్ ఛేంజర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని సౌత్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ శంకర్ డైరెక్ట్ చేశారు. సంక్రాంతి కానుకగా 2025 జనవరి 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారతీయ ప్రధాన ప్రాంతీయ భాషలతో వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా విడుదలైంది. రిలీజ్ కు ముందు నుంచే ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కానీ రిలీజ్ తర్వాత 'గేమ్ ఛేంజర్'పై వచ్చిన రివ్యూలు, ఆడియెన్స్ ఒపీనియన్ అంతా వ్యతిరేకంగా ఉండింది. ఎంతో హైప్ క్రియేట్ చేసిన ఈ చిత్రం ఫైనాన్షియల్ గా మాత్రం హిట్ సాధించలేకపోయింది. ఈ సినిమా ఫెయిల్యూర్‌పై టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ స్పందించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో 'గేమ్ ఛేంజర్' ఫ్లాప్ కావడానికి పలు కారణాలను, ఆయన వెర్షన్ ను తెలియజేశారు. "శంకర్ చిత్రాలు మాసీవ్ బడ్జెట్ తో రూపుదిద్దుకుంటాయి. దానికి తగట్టుగానే కమర్షియల్ గానూ, ఆడియెన్స్ ను గాను తనవైపు తిప్పుకునేందుకు ఓ ప్రధాన అంశం ఆయన చిత్రాల్లో ఉంటుంది. అందువల్లే శంకర్ గత చిత్రాలు పెద్ద ఎత్తున సక్సెస్ సాధించాయి. ఒక్కడులో... ఒక్క రోజు సీఎం, రోబోలో... మేషిన్ మనిషిని ప్రేమించడం వంటి ప్రైమ్ సబ్జెక్ట్ ఉండటం వంటివి శంకర్ సినిమాలకు మార్క్ అన్నారు. ఆ అంశాలే జనాలను బాగా ఆకట్టుకున్నాయని, కమర్షియల్ గా సక్సెస్ ను సాధించి పెట్టాయన్నారు. కానీ గేమ్ ఛేంజర్ లో అలాంటి ప్రధాన అంశం అంటూ ఏదీ జనాలకు కనిపించకపోయి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.



# శ్రీకాంత్ మళ్ళీ భయ పెడతాడట!

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఒకప్పటి హీరోయిన్ విజయశాంతి ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపిస్తారు. సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, అర్జున్ రాంపాల్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు గతంలో రుద్ర మెరుపు లాంటి టైటిల్స్ వినబడిన ఇప్పుడు 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' అనే టైటిల్‌ని చిత్రబృందం కన్ఫర్మ్ చేసినట్లు గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది.. ఈ విషయం త్వరలోనే అధికారికంగా ప్రకటించబోతున్నారు.

షూటింగ్ చివరిదశకి చేరుకున్న ఈ సినిమాని ముప్పా వెంకయ్య చౌదరి, సునీల్ బలుసు, అశోక్ వర్దన్, కల్యాణ్ రామ్ కలిసి నిర్మిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ స్వరాలు అందిస్తున్న సినిమా గురించి ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. అదేంటంటే ఒకప్పుడు ఫ్యామిలీ హీరో ఇమేజ్ తో ఎన్నో సూపర్ హిట్స్ అందుకున్న శ్రీకాంత్ ఒక భయపెట్టే పాత్రలో కనిపించబోతున్నాడు అని తెలుస్తోంది. నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో తన నట విశ్వరూపాన్ని చూపించాడని ఇన్సైడ్ వర్గాల సమాచారం.. శ్రీకాంత్ కెరియర్లో ఈ సినిమా కూడా ఒక మరుపురాని సినిమాగా నిలిచిపోతుందని చెబుతున్నారు. నిజానికి ఈ సినిమా కంటే ముందే శ్రీకాంత్ అఖండ లాంటి సినిమాలో కూడా తన విలనిజం పండించాడు. మరి ఈ సినిమా ఎలా ఉండబోతుంది ? అది ఎంత వరకు నిజం అవుతుంది అనేది.



# రాజకీయాలంటే చాలా ఇష్టం..

ప్రస్తుతం టాలీవుడ్‌లో లీడ్‌లో ఉన్న యంగ్ హీరోల్లో కిరణ్ అబ్బవరమ్ ఒకడు. ఎప్పటికప్పుడు కొత్త కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. ప్రస్తుతం 'దిల్ రూబా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నవాడు. ఈ క్రమంలోనే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు చెప్పాడు. ఒకవేళ యాక్టర్ కాకపోయి ఉండి ఉంటే తప్పకుండా రాజకీయాల్లోకి వెళ్లుండేవాడినని చెప్పాడు. తనకు రాజకీయాలంటే చాలా ఇష్టమని, తాను ఎన్నో రాజకీయాలను చూశానని చెప్పాడు.

"నాకు రాజకీయాలంటే ఎంతో ఇష్టం. నటుడిని కాకపోయి ఉంటే నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టేవాడిని. మంచి, చెడు అనేది పక్కన పెట్టి ప్రజలతో మమేకం కావడం నాకు నచ్చుతుంది. రాయలసీమకు చెందిన వ్యక్తిని కావడంతో చిన్నప్పటి నుంచి రాజకీయాలను దగ్గరగా చూశా. అందువల్లనే నాకు కూడా వాటిపై ఆసక్తి పెరిగిందనుకుంటున్నా. భవిష్యత్తులో వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాలనుకుంటున్నా. ఫుడ్ బిజినెస్‌లో రాణించాలనేది నా ఆసక్తి. మంచి రాయలసీమ స్టైల్ ఆహారం అందించాలని ఉంది. అందుకు సంబంధించిన సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనే అనౌన్స్ చేస్తాను" అని కిరణ్ అబ్బవరం తెలిపారు.

